క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్ పర్సన్ చల్లం చర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ మంగళవారం తెలిపారు. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియోగా స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ హాజరవుతారన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలన్నారు.

పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో రహదారి మరమ్మతులు



సత్తెనపల్లి/రాజుపాలెం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన పురస్కరించుకొని విజయపురి సౌత్ నుంచి మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రాజుపాలెం, ధూళ్ళిపాళ్ల, సత్తెనపల్లి మీదుగా వెలగపూడి రాజధాని వైపు వెళ్లే వాహనాల రద్దీ దృష్ట్యా కొండమోడు జంక్షన్ నుంచి సత్తెనపల్లి పట్టణం మధ్య గల రోడ్డుకి ఇరువైపుల మార్జిన్‌లో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా సత్తెనపల్లి రూరల్ సీఐ పీ కిరణ్, రాజుపాలెం ఎస్‌ఐ వేణుగోపాల్, నేషనల్ హైవేస్ అథారిటీ ఏఈ ప్రకాశం, తదితరులు మంగళవారం మార్జిన్ రోడ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అంతేకాక మాచర్ల-గుంటూరు రహదారికి ఇరువైపుల ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

మండల విద్యాశాఖాధికారి శివబాబు

అమరావతి: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఉచిత విద్య అభ్యసించడానికి ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి శివబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ విద్యా హక్కు చట్టం అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పిల్లలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఇందులో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4, బీసీ, మైనారిటీలకు 6 శాతం, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం సీట్లు కేటాయించబడతాయన్నారు. ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో మే 15వ తేదీ లోపు సమీపంలోని సచివాలయంలో గానీ, మండల విద్యా శాఖ కార్యాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు జూన్ 2, 2019–మే, 31, 2020 మధ్య జన్మించి ఉండాలన్నారు.

రహదారి మధ్యలో విద్యుత్ స్తంభంతో అవస్థలు



సత్తెనపల్లి: పట్టణ గుంటూరు రోడ్డులోని 10వ వార్డు వాసవి నగర్‌లో కరెంట్ ఏడీఈ ఆఫీసు సబ్ స్టేషనుకు ఉత్తరంగా ఎదురు రోడ్డు (రవి పార్సిల్)లో మెయిన్ లైన్ కరెంట్ స్తంభం రహదారి మధ్యలో ఏర్పాటు చేశారు. ఈ రహదారిలో వచ్చిపోయే వాహనాలకు, కళాశాల, హాస్టల్ విద్యార్థులకు, పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయానికి రాకపోకలు సాగించే భక్తులకు, పొలాలకు వెళ్లే ట్రాక్టర్ల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారిందని ఆ ప్రాంత ప్రజానీకం విద్యుత్ అధికారులకు, మునిసిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి మార్గం సుగమమం చేయవల్సిందిగా ఆ ప్రాంత ప్రజానీకం కోరుతున్నారు.

సత్తెనపల్లి నుంచి సత్తెమ్మ తల్లి గుడికి బస్సు



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి అచ్చం పేట మండలం మాదిపాడు సమీపంలోని సత్తెమ్మ తల్లి గుడి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి నుంచి సత్తెమ్మ తల్లి గుడి వరకు వయా క్రోసూరు, అచ్చంపేట మీదుగా ప్రతి ఆదివారం ఉదయం 8 గంటలకు సత్తెనపల్లిలో బస్సు బయలుదేరుతుందన్నారు. 8:45 గంటలకు క్రోసూరు, 9 గంటలకు అచ్చంపేటలో బయలుదేరి మధ్యాహ్నం 3:30 గంటలకు సత్తెమ్మ తల్లి గుడి వద్దకు చేరుకుంటుందన్నారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి సత్తెనపల్లి వస్తుందన్నారు. కేవలం ఆదివారం మాత్రమే బస్ సర్వీస్ అందుబాటులో ఉంటుందనే విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

గిట్టుబాటు కాక.. ప్రభుత్వం కొనక..!

- ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోలేక నష్టపోతున్న రైతులు
- మండలంలో 610 ఎకరాల్లో రబీ వరి సాగు
- కొనుగోలుపై ప్రభుత్వం ప్రకటించ లేదంటున్న రైతులు
- ఆర్ఎస్‌కేల్లో నమోదు చేసుకుంటే కొంటారంటున్న వ్యవసాయాధికారి

క్రోసూరు: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే రైతన్న పరిస్థితి రోజురోజుకూ అగమ్య గోచరంగా ఉంది. వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని పంటలు సాగుచేస్తే గిట్టుబాటు ధర కూడా లభించక తీవ్ర నష్టాల్లో మునిగిపోతున్నారు. ఒక పక్క మిర్చికి ధరలేక మిర్చి రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతుండగా.. మరోపక్క రబీ సాగులో ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనలు చేయటం లేదని చేతిలో పంటను ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. రైతులు మండలంలోని పెరికపాడు, ఆవులవారిపాలెం, దొడ్లేరు గ్రామాల్లో 610 ఎకరాలలో దాళ్వా (రబీ) వరి సాగు చేశారు. ఇందులో లావు రకాలు (1050), అంకుర్ సన్నాలు, హైదరాబాద్ బీపీటీ రకాలు ఉన్నాయి. ఎప్పుడు గాలివానలొచ్చి పంటలు పాడవుతాయోనన్న భయంతో రైతులు పంట కోతకొచ్చిన వెంటనే యంత్రాలతో కోసి ఇళ్లకు చేర్చుకోవటం, లేదా అక్కడే విక్రయించుకోవటం జరుగుతుందని రైతులు అంటున్నారు.



దొడ్లేరులో వరి కోతలు కోస్తున్న యంత్రం

పెట్టుబడి కూడా రావటం లేదు

వరి సాగుకు ఎకరాకు రూ.45 వేలు ఖర్చు అవుతుందని, కానీ దిగుబడి 25 బస్తాల నుంచి 30 బస్తాలు వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర చూస్తే పెట్టుబడి కూడా రావటం లేదని, ప్రభుత్వం ధాన్యం కొంటున్నట్లు ఇప్పటి వరకు ఎక్కడా ప్రకటించ లేదని, మండలంలో ఎక్కడా కొన్నట్లు కూడా లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ముందుగా రైతులు సాగు చేసే పంటలకు మద్దతు ధర ప్రకటించి కొనుగోళ్లు జరుగుతున్నాయని ప్రచారం చేయాల్సి ఉన్నా అటువంటిదేమీ లేకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహించటం పట్ల రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వానికి అమ్మదలిస్తే వారి నామ్స్ ప్రకారం ఉండాలి. ఈ సమస్యలను తట్టుకోలేక ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం విక్రయించుకోవాల్సి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయక, ధర లేక ప్రైవేటు వ్యాపారాలకు విక్రయించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



కోసిన ధాన్యం

గత ఏడాది కంటే తక్కువ ధర

గత ఏడాది గత ప్రభుత్వం మద్దతు ధర ముందే ప్రకటించడం, ప్రభుత్వం కొనుగోలు చేయడంతో ఇదే ధాన్యం లావులు క్వింటా రూ.1,200, సన్నాలు రూ.1,800 నుంచి రూ.2,000కు ప్రైవేటు వ్యాపారులు కూడా కొన్నారని రైతులు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది ప్రస్తుత ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించ లేదు. అదే విధంగా ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం క్వింటా రూ.1,350కు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు పంటలు పండించినా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు.

ఐదున్నర ఎకరం సాగు చేసా



నేను ఐదున్నర ఎకరాల్లో వరి సాగు చేసాను. ఎప్పుడు పడితే అప్పుడు అకాల గాలి వానలకు భయపడి యంత్రంతో కోయించి అక్కడే విక్రయిస్తున్నా. క్వింటా రూ.1,350కు కొంటున్నారు. ప్రభుత్వం ఎక్కడా కొంటున్నట్లు ప్రకటించలేదు.

– మర్రి శ్రీనివాసరెడ్డి, దొడ్లేరు (ఉత్తమ రైతు అవార్డు గ్రహీత)

పది ఎకరాల్లో సాగు చేసాను



వరి పంట పది ఎకరాల్లో సాగు చేసాను. ధర లేకపోవటంతో ధాన్యాన్ని ఇంటికి చేర్చుకుంటున్నాం. కొంత కాలం చూసి ధరను బట్టి అమ్ముకుంటాం.

– కనిగిరి సుజాత లక్ష్మి, దొడ్లేరు

కోతలు ఇంకా పూర్తి కాలేదు

వరి కోతలు ఇంకా పూర్తి కాలేదు. ప్రభుత్వం జీడీసీఎంసీ ద్వారా ఎమ్మెస్పీ ధరకు ఏ గ్రేడ్ ధాన్యం కొనుగోలు చేస్తుంది. రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. దానికి ఒక ప్రక్రియ ప్రకారం ఉంటుంది. తేమ శాతం పరిశీలిస్తారు. ఈ క్రాప్ నమోదు ఉండాలి, కౌలుదారుడైతే సీసీఆర్సీ కార్డు ఉండాలి. రైతులు ఇష్టపడితే ఈ పద్ధతిలో పేరు నమోదు చేసుకోవచ్చు.

– వేణుగోపాల్, ఏవో, క్రోసూరు

రహదారి ధ్వంసం చేసినా చర్యలు శూన్యం

సత్తెనపల్లి: పట్టణంలోని 30వ వార్డులో త్రికోటేశ్వర వైన్ షాప్‌కి ఎదురుగా రహదారి స్థలం ధ్వంసం చేసినప్పటికీ ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాలకుల అండదండలు ఉండడంతో అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని 30వ వార్డు త్రికోటేశ్వర వైన్ షాప్ ఎదురుగా స్థలం కొలత తక్కువగా ఉందని రోడ్డు సగం వరకు ధ్వంసం చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోడెల శివప్రసాదరావులు వావిలాల స్మృతి వనం ఎదురు రోడ్డు విశాలంగా ఉండాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్ద రోడ్డు వేశారు. ఆ తర్వాత వచ్చిన శాసనసభ్యుడు అంబటి రాంబాబు కూడా కొనసాగించారు. కానీ ప్రస్తుత పాలకులు పట్టించుకోక పోవడంతో వారి అండదండలతో ఆ స్థలాన్ని ధ్వంసం చేసి ఆక్రమించుకున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డును ధ్వసం చేసి మూడు రోజులైనా అధికారులు పట్టించుకోక పోవడంతో కేవలం పాలకుల అండదండలతోనే అధికారులు పట్టించుకోవడం లేదనేది తేటతెల్లమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంగతి దేవుడెరుగు చేసిన అభివృద్ధిని ధ్వంసం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే రోడ్డు విషయంలో పాలకులు, అధికారులు జోక్యం చేసుకోవాలని లేకుంటే భవిష్యత్తులో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు.



30వ వార్డులో రహదారి ధ్వసం చేసి మట్టిపోసిన ప్రాంతం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత



మాదల(ముప్పాళ్ళ): అంగన్‌వాడీ కేంద్రంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో 3, 6 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రికార్డులు పరిశీలించారు. కేంద్రంలో నమోదైన వారంతా హాజరయ్యేలా చూడాలని చెప్పారు. పోషణ్ ట్రాకర్‌లో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం పంపిణీ గడువులోపు పూర్తి చేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుపై సంబంధిత వ్యక్తి నుంచి వివరణ సేకరించారు. మూడవ నంబర్ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన లబ్ధిదారు కేంద్రానికి రెండు కుర్చీలను సీడీపీఓ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గంగా పార్వతి సమేత నగరేశ్వరుని కల్యాణం

ముప్పాళ్ళ: మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న వాసవి కన్యకాపరమేశ్వరి నగరేశ్వరి స్వామి దేవస్థానంలో గంగా పార్వతి సమేత నగరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 30వ తేదీన జరుగుతుందని దేవస్థానం అధ్యక్షుడు చిలకల సాంబశివరావు మంగళవారం తెలిపారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ

క్రోసూరు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని తద్వారా అనంతమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ కోరారు. మంగళవారం రెండవ రోజు మండల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ దైనందిక జీవితంలో కొంత సమయం గ్రంథాలయంలో గడపాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



క్రోసూరు గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలలో విద్యార్థులు

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

అమరావతి: అమరావతి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీషు, ఆటపాటలు విద్యార్థులకు నేర్పిస్తామని స్థానిక గ్రంథాలయాధికారి లక్ష్మి తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించటానికి కథలు చెప్పటం, ఆటలు ఆడించడం చేస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చిత్రలేఖనంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఉచితంగా మజ్జిగ పంపిణీ అభినందనీయం

సత్తెనపల్లి: వేసవి కాలంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందించాల్సిన విషయమని పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త రామకృష్ణ, దేవరపల్లి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలుగా జరుగుతున్న మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు సందర్శించి మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంతో మంది దాహార్తిని తీరుస్తున్నారని, దీనిలో తమను కూడా భాగస్వాములను చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్త రామకృష్ణ సీఐ నాగమల్లేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, సెక్రటరీ దేవరపల్లి కాశీవిశ్వనాథ్, చెక్కా రవికుమార్, స్వామి ప్రసాద్, దేవరపల్లి రాఘవ, తేజ, ఉప్పాల నవీన్ కుమార్, హరికృష్ణ, పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ నాగమల్లేశ్వరరావు

సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉండాలి

రెంటచింతల: పంటల సాగుకు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని, సూక్ష్మ పోషకాలపై అవగాహనతో ఎంతో ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లయితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వావిలాల



సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్, సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఆదర్శప్రాయుడని వావిలాల్ ఇండోర్ స్టేడియం ప్రెసిడెంట్ డాక్టర్ జి.శ్రీధర్ అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య వర్థంతిని పురస్కరించుకొని పట్టణంలోని వావిలాల్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వావిలాల గోపాలకృష్ణయ్య నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్టేడియం సెక్రటరీ ముదినేడి సుబ్బయ్య, కోశాధికారి సూర్యనారాయణ, సభ్యులు రఫీ, హనుమంతరావు, సాంబశివరావు, లతీష్, వెంకట్, చందు, రాంబాబు, తిరుపతి, బ్యాడ్మింటన్ క్రీడా శిక్షణ చిన్నారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం

రెంటచింతల: తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకంను ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు, వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట సైదయ్య మాట్లాడుతూ తహసీల్దార్ మేరీ కనకం మండలంలో 2014 నుంచి వీఆర్వోగా, డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి మంచి అధికారిగా మండల ప్రజలచే గుర్తింపు పొందినట్లు తెలిపారు. సన్మానించిన వారిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నాళం పెదబాబు, పొట్టిమూర్తి రాంబాబు, ఆకుల నరసింహారావు, కొత్త గోపాలరావు, ఏచూరి మునలయ్య, కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా సమష్టిగా పనిచేయాలి

ఎంపీపీ మేచారపు అనురాధ



మాట్లాడుతున్న ఎంపీపీ మేచారపు అనురాధ

నకరికల్లు: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేచారపు అనురాధ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ అనురాధ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో తలెత్తే సమస్యలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పలు శాఖల అధికారులు శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎంపీడీఓ జి.కాశయ్య మాట్లాడుతూ మండలంలో కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లు సత్వరమే పంపిణీ చేయాలన్నారు. బోర్లు, బావులకు మరమ్మతులు చేయించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో బీమాకు కూలీలు నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఉపాధి హామీ కూలీ రూ.307కు పెరిగిందని ఎక్కువ మంది ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రధాని పర్యటన విజయవంతంలో భాగస్వాములు కావాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

ఐసీడీఎస్ సీడీపీవో బి.సరళ

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న సీడీపీవో సరళ

బెల్లంకొండ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని క్రోసూరు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో బి.సరళ తెలిపారు. ఈ నెల 25న 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'మొక్కుబడిగా పోషణ్ పక్వాడా' కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలోని బీసీ అంగన్‌వాడీ సెంటర్‌లో మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి, పలు సూచనలు చేశారు. అదేవిధంగా 'కిశోర వికాసం' కార్యక్రమంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో సరళ మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు గ్రామ స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కిశోర వికాసం, కమిటీల ఏర్పాటు, పర్యవేక్షణ సమావేశాలు, బాల్యవివాహాలను నిరోధించుట, జీవిత నైపుణ్యాలు, ఆరోగ్యం తదితర అంశాలపై బాలికల్లో అవగాహన కల్పించాలని సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులపై జూన్ 4 నుంచి 10 వరకు గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. పోక్సో యాక్ట్, జేజే యాక్ట్ మొదలైన అంశాలపై వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు పరిమళ, వనజ, జీఎంఎస్‌కే ఎం.మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యేసుక్రీస్తు చల్లని దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ప్రభువైన యేసుక్రీస్తు చల్లని దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, దేవునియందు విశ్వాసంతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో మెలగాలని మాజీ శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని తాడువాయిలో నూతనంగా నిర్మించిన తిరుకుటుంబ దేవాలయ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడారు. దేవాలయ నిర్మాణంలో సహాయ, సహకారాలు అందించడం తనకు యేసుక్రీస్తు కల్పించిన అవకాశంగా భావిస్తానన్నారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని, అండదండలు అందిస్తానని చెప్పారు. ప్రభువైన ఏసుక్రీస్తు చూపిన మార్గంలోనే అందరం పయనిద్దామని పిలుపునిచ్చారు. ప్రతిఫలం ఆశించకుండా చేసే సేవా మన వెనుక వస్తుందన్నారు. అనంతరం గుంటూరు పీఠాధిపతులు మహాఘన చిన్నాబత్తిన భాగ్యయ్య మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, భూక్యా కృష్ణానాయక్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సాదర్ల శ్రీనివాసరావు, మాదిపాడు సర్పంచ్ మాదా వెంకట్రావు, మైనారిటీ నాయకులు షేక్ కరిముల్లా, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, ఆలా శ్రీనివాసరావు, షేక్ సుభాని, అచ్చంపేట సర్పంచ్ జాని, కంబాల వీరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా జీవించడమే క్రైస్తవ జీవితం

గుంటూరు పీఠాధిపతులు రెవ.చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట: ఆదర్శవంతంగా జీవించడమే క్రైస్తవ జీవితమని గుంటూరు పీఠాధిపతులు రెవ.చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని తాడువాయిలో రూ.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన తిరుకుటుంబ దేవాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. దివ్యబలిపూజలు నిర్వహించారు. బైబిల్ పఠన చేసి యేసుక్రీస్తు సందేశాన్ని అందించారు. దేవుని మౌనంగా ఆరాధించుకోవాలని, పశ్చాత్తాపం పొందాలన్నారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను ప్రేమించాలని, వారిని నొప్పించకూడదని చెప్పారు. క్షమ, దయ, ఓర్పు కలిగి ఉండాలని, స్వార్థం జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరు తమలో ఉన్న స్వార్థాన్ని విడనాడాలన్నారు. ముందుగా క్రైస్తవ సోదరులు పీఠాధిపతులు భాగ్యయ్యకు చర్చి మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో తాళ్లచెరువు విచారణ గురువులు పుట్టి అంతోనిరాజు, రెవ.ఫాదర్ జాన్సేష్, కోట అంతోనిరాజు, కోపూరి ప్రకాష్, గురువులు, కన్యాస్త్రీలు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ సోదరులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



చర్చి ప్రారంభోత్సవంలో పీఠాధిపతులు రెవ.చిన్నాబత్తిన భాగ్యయ్య



హాజరైన క్రైస్తవ భక్తులు